హెచ్‌ఎఫ్‌ఐ 50 ఏళ్లుగా కొనసాగుతోంది..

వరంగల్ స్పోర్ట్స్: హ్యాండ్‌బాల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా 50 సంవత్సరాలుగా అనేక అంతర్జాతీయ క్రీడాకారులను తీర్చిదిద్దిందని తెలంగాణ హ్యాండ్‌బాల్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి శ్యామల పవన్‌కుమార్ స్పష్టం చేశారు. 'సాక్షి'లో గురువారం 'ఒకే క్రీడ .. రెండు సంఘాల' అనే శీర్షికతో ప్రచురితమైన కథనానికి స్పందించారు. గ్రామీణ స్థాయిలో ప్రతిభ గల హ్యాండ్‌బాల్ క్రీడాకారులను గుర్తించి జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించేలా శిక్షణ అందించిన ఘనత హెచ్‌ఎఫ్‌ఐది అన్నారు. కేవలం రెండు సంవత్సరాల క్రితం హ్యాండ్‌బాల్ అసోసియేషన్ ఇండియాతో కొత్త సంఘం ఏర్పాటైందన్నారు. దీనికి సాయ్, శాట్‌ల నుంచి సహకారం లేదని, హెచ్‌ఎఫ్‌ఐకే అనుకూలంగా ఉన్నాయని తెలిపారు. త్వరలో కోర్టు తీర్పు కూడా హెచ్‌ఎఫ్‌ఐకి అనుకూలంగా రానుందని తెలిపారు.

యథావిధిగా రైళ్ల రాకపోకలు

కాజీపేట రూరల్: పెద్దపల్లి జిల్లాలో జరిగిన గూడ్స్ రైలు ఘటనతో బుధవారం రద్దు, దారి మళ్లింపు, రీషెడ్యూల్ అయిన రైళ్లు గురువారం నుంచి యథావిధిగా నడుస్తున్నట్లు రైల్వే అధికారులు తెలిపారు. బల్హార్షా–విజయవాడ– సికింద్రాబాద్ రూట్‌లో కాజీపేట మీదుగా ప్రయాణించే రైళ్లన్నీ యాథావిధిగా నడుస్తున్నట్లు చెప్పారు. గూడ్స్ ఘటనలో సికింద్రాబాద్– దానాపూర్ ఎక్స్‌ప్రెస్ గురువారం రద్దయిందన్నారు. శుక్రవారం నుంచి యథావిధిగా నడవనున్నట్లు తెలిపారు.

నేడు 'డయల్ యువర్ ఆర్‌ఎం'

హన్మకొండ: ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించేందుకు అవసరమైన సలహాలు, సూచనలు తెలుసుకునేందుకు శుక్రవారం డయల్ యువర్ ఆర్‌ఎం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆర్టీసీ వరంగల్ ఆర్‌ఎం డి.విజయభాను తెలిపారు. మధ్యాహ్నం 12 నుంచి 1 గంట వరకు డయల్ యువర్ ఆర్‌ఎం కార్యక్రమం నిర్వహించనున్నట్లు వివరించారు. ప్రయాణికులు 9959226056 నంబర్‌కు ఫోన్ చేసి తమ సమస్యలు వివరించి సలహాలు, సూచనలు అందించాలని కోరారు.

షేక్‌హ్యాండ్ ఇచ్చి... కేక్ తినిపించి..

చైల్డ్ హోం పిల్లలతో సరదాగా గడిపిన ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్

- పిల్లల అవసరాలు తీర్చేందుకు సహకారమందిస్తా
- 'సాక్షి' మీడియా ఆధ్వర్యంలో మహబూబాబాద్ చైల్డ్ హోంలో బాలల దినోత్సవం



పిల్లలతో కలిసి కేక్ కట్ చేస్తున్న ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్

మహబూబాబాద్ : 'వారిలో కొందరు అమ్మానాన్నలు లేనివారు.. మరికొందరు విధి వంచితులు ఉన్నారు.. తమ వారు ఎక్కడ ఉన్నారో తెలియదు.. ముక్కుపచ్చలారని వయసులో చైల్డ్‌హోం నిర్వాహకులే అమ్మానాన్నలు, సాటి బాల బాలికలే అన్నాదమ్ముళ్లు.. అక్కా చెల్లెళ్లుగా జీవిస్తున్నారు. వీరితో మహబూబాబాద్ ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్ సరదాగా గడిపారు.. చిట్టి చేతులకు షేక్ హ్యాండ్ ఇచ్చారు.. మానసిక పరిపక్వత లేని బాలలతో ముచ్చటించారు. పేరు అడిగారు..ఏం చదువుతున్నావో చెప్పమన్నారు.. బాగా చదువుకోవాలి అని చెప్పి ఒప్పించారు. వారి మధ్యలో కూర్చుని కబుర్లు చెప్పారు.. కేక్ కట్‌చేసి సంబురాలు పంచుకున్నారు. కేక్ తినిపించి ఆప్యాయత పంచారు. ఈ ఆనందకర ఘటన గురువారం 'సాక్షి' మీడియా, దైవ కృప వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో మహబూబాబాద్ పట్టణంలో నిర్వహించిన బాలల దినోత్సవ కార్యక్రమంలో జరిగింది.

కేక్ కట్ చేసి.. పిల్లల మధ్య కూర్చుని కబుర్లు

బాలల దినోత్సవం సందర్భంగా దైవ కృప చైల్డ్‌హోంలో నిర్వహించిన కార్యక్రమానికి ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్ హాజరయ్యారు. ఈ సందర్భంగా పిల్లల మధ్య కూర్చుని వారితో ముచ్చటించారు. వారిలో ఒక చిన్నారి తన పేరు 'నాని' అని చెప్పడంతో హీరో నాని అంటూ పొగిడారు. అనంతరం పిల్లలతో కలిసి కేక్ కట్ చేశారు. వారిలో ఇద్దరు పిల్లలను ఎత్తుకుని వారికి కేక్ తినిపించారు. ఆట, పాటల్లో గెలుపొందిన వారితోపాటు, పిల్లలందరికీ కంపాక్స్‌లు, పరీక్ష ప్యాడ్స్, వాటర్ బాటిల్స్, తదితర బహుమతులు అందజేశారు. పండ్లు, బిస్కెట్లు, పంపిణీ చేశారు.

పిల్లలు దేవుడిచ్చిన వరం

పిల్లలు దేవుడు ఇచ్చిన వరమని, వారికి సేవ చేసే అవకాశం రావడం అదృష్టంగా భావించి పనిచేయాలని ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్.. నిర్వాహకులకు సూచించారు. పిల్లల విద్య, ఆరోగ్యం విషయంలో శ్రద్ధ పెట్టాలన్నారు. ఉన్నత స్థాయికి ఎదిగిన వారి చరిత్రలు చెప్పాలన్నారు. సమాజంలోని మంచి పౌరులుగా తీర్చిదిద్దితే వారి భవిష్యత్ బంగారు మయం చేసిన వారవుతారన్నారు. పిల్లల పోషణ, వారి అవసరాలను తీర్చేందుకు తమ వంతు సహకారం ఉంటుందని హామీ ఇచ్చారు. వారిలో అనాథలం, ఎవరూ లేని వారం అనే భావన రాకుండా చూడాలన్నారు. చిన్నప్పటి నుంచే మనోధైర్యం నింపాలని చెప్పారు. పిల్లలు శ్రద్ధగా చదువుకుని ఉన్న స్థాయికి ఎదగాలన్నారు.

వార్తలకే పరిమితం కాకుండా..

మీడియా అంటే హడావుడి.. వార్తలు, కథనాల పేరుతో బీజీగా ఉంటారు.. కానీ'సాక్షి' వార్తలకే పరిమితం కాకుండా ఇలాంటి కార్యక్రమాలు చేయడం అభినందనీయమన్నారు. మంచి వార్తలు రాసి సమాజాన్ని సన్మార్గంలో నడిపించేందుకు యత్నించాలని చెప్పారు. బాలల దినోత్సవం సందర్భంగా చైల్డ్ హోంలో కార్యక్రమాన్ని నిర్వహించి నన్ను ఆహ్వానించిన 'సాక్షి' మీడియా, దైవ కృప వెల్ఫేర్ సొసైటీ నిర్వాహకులను మనస్ఫూర్తిగా అభినందిస్తున్నానన్నారు. ఈకార్యక్రమంలో చిల్డ్రన్స్ ప్రొటెక్షన్ ఆఫీసర్ బి. వీరన్న, 'సాక్షి' స్టాఫ్ రిపోర్టర్ ఈరగాని భిక్షం, ఆర్‌సీ ఇన్‌చార్జ్ అర్రం రమేశ్ చందర్, అర్బన్ రిపోర్టర్ కిరణ్, 22 మంది పిల్లలు , సిబ్బంది పాల్గొన్నారు.



పిల్లలకు గిఫ్టులు ఇస్తున్నఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్

దాతల సహకారం మరువలేనిది..



ఆర్ఫన్స్, సెమీ ఆర్ఫన్స్‌తోపాటు, వృద్ధులు, మానసిక దివ్యాంగులకు సేవ చేయాలని లక్ష్యంతో సంస్థను నిర్వహిస్తున్నా. పిల్లల చదువులు, వారికి బలమైన ఆహారం కోసం దాతల సహకారం మరువలేనిది. వారి ప్రోత్సాహంతోనే పిల్లలను పోషిస్తున్నా. పిల్లలను మంచి పౌరులుగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తా.

-బి. లోకేశ్, చిల్డ్రన్స్ హోం నిర్వాహకుడు

సంతోషంగా ఉంటాం



నా చిన్నప్పుడు హోంలో చేరా. ఇప్పుడు తొమ్మిదో తరగతి చదువుతున్నా. హోంలో ఉన్న వారందరం ఒకరికొకరం అన్నట్లు ఉంటాం. పండుగలు, ప్రత్యేక రోజుల్లో హోంకు వచ్చే దాతలు, వారు చూపించే ఆప్యాయత మర్చిపోలేం. బాగా చదువుకుని ఉన్నత ఉద్యోగం సాధిస్తా. నాలాంటి పిల్లలకు సేవ చేస్తా.

సాయి చరణ్, 9వ తరగతి

సార్ చూపించిన ఆప్యాయత మరిచిపోలేం



ఈరోజు మా హోంకు వచ్చిన ఎస్పీ సార్, ఇతర పెద్దలు మాతో ఆప్యాయంగా గడిపారు. గిఫ్టులు ఇచ్చారు. సార్ మా మధ్యలో కూర్చుని అందరి పేర్లు అడిగి తెలుసుకున్నారు. తమ్ముళ్లకు షేక్ హ్యాండ్ ఇచ్చారు. కేక్ తినిపించారు. సార్ చూపించిన ఆప్యాయత మరిచిపోలేం. సార్ చెప్పినట్లు కష్టపడి బాగా చదువుతా..

జగదీశ్, 9వ తరగతి

మీ ఎదుగుదలకు అండగా ఉంటాం

- నర్సంపేట ఆర్డీఓ ఉమారాణి
- 'సాక్షి' మీడియా ఆధ్వర్యంలో నర్సంపేటలోని సంజీవని చైల్డ్‌హోంలో బాలల దినోత్సవం



విద్యార్థినులకు బహుమతులు అందజేస్తున్న ఆర్డీఓ ఉమారాణి

నర్సంపేట: తల్లిదండ్రులు లేని అనాథలు ఎంతో ఆందోళనకు గురవుతారు.. వారి ఎదుగుదలకు అండగా ఉంటాం.. మీరు (అనాథపిల్లలు) క్రమశిక్షణతో కూడిన విద్యనభ్యసిస్తూ భవిష్యత్‌లో ఉన్నత స్థానానికి చేరుకోవాలని నర్సంపేట ఆర్డీఓ ఉమారాణి అన్నారు. 'సాక్షి' మీడియా ఆధ్వర్యంలో నర్సంపేటలోని సంజీవని చైల్డ్ హోంలో గురువారం బాలల దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఆర్డీఓ ఉమారాణి.. చిన్నారుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. డ్రాయింగ్‌లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులను అభినందించారు.

'సాక్షి' కృషి అభినందనీయం..

'సాక్షి'మీడియా ఆధ్వర్యంలో బాలల దినోత్సవం సందర్భంగా విద్యార్థుల ప్రతిభ వెలికి తీసే విధంగా పలు కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమని ఆర్డీఓ అన్నారు. పర్యావరణ పరిరక్షణపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. బాలల దినోత్సవం సందర్భంగా చిన్నారులకు ప్రోత్సాహం అందిస్తూ బహుమతులు ఇవ్వడం సంతోషకరమని తెలిపారు.

విద్యార్థులతో మాటామంతీ...

పర్యావరణంతోపాటు చెట్లు, జంతువుల ఆవశ్యకత అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులు వేసిన డ్రాయింగ్‌ను పరిశీలించారు. పోటీ పరీక్షల్లో ఉత్తమంగా రాణించాల్సిన అవసరం ఉందని సూచనలు చేశారు. విద్యార్థుల జీవన విధానం తెలుసుకున్నారు. విద్యార్థులకు అందే సౌకర్యాలపై ఆరా తీశారు. చైల్డ్ హోం నిర్వాహకులు అందిస్తున్న సేవలు తెలుసుకుని సంతోషం వ్యక్తం చేశారు. విద్యార్థులు, చైల్డ్ హోం అభివృద్ధికి తనవంతు సహకారం అందిస్తానని తెలిపారు. ఆర్డీఓ సమయం కేటాయించి ముచ్చటించడం విద్యార్థులకు సంతోషం కలిగింది.

ఉత్తమ ఫలితాలు సాధించాలి..

'విద్యార్థుల్లో ఎలాంటి ఆందోళన ఉండొద్దు.. హోం నిర్వాహకులు అందిస్తున్న సహకారంతో ఉత్తమ ఫలితాలు సాధించాలి.. కష్టాలు ధైర్యంగా ఎదుర్కొని భవిష్యత్‌లో మంచి స్థానంలో నిలవాలి.. కష్టాలు వచ్చాయనే భావన విద్యార్థుల్లో లేకుండా తొలగిపోతాయనే నమ్మకంతో ముందుకు సాగాలి' అని వనప్రేమి అవార్డు గ్రహీత గోకా రామస్వామి తెలిపారు. సమాజం అంతా మనతో ఉందనే భావనతో లక్ష్యం ఎంచుకుని గమ్యాన్ని చేరుకునే వరకు కష్టపడుతూనే ఉండాలని సూచించారు.

కేక్‌కట్ చేసి స్వీట్లు పంచి..

బాలల దినోత్సవం సందర్భంగా ఆర్డీఓ ఉమారాణి.. చిన్నారులతో కలిసి కేక్‌కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. విద్యార్థులకు పెన్నులతో పాటు మోడల్స్ అందజేశారు. గంటకు పైగా విద్యార్థులతో ముచ్చటించి సంతోషించారు. ఈ కార్యక్రమంలో 'సాక్షి' ఆర్‌సీ ఇన్‌చార్జ్ అబ్బు వెంకట్‌రెడ్డి, ముత్తోజు కిరణ్, గండ్రోతు రమేశ్, చైల్డ్ హోం నిర్వాహకులు డాక్టర్ మోహన్‌రావు, వినోద, తదితరులు పాల్గొన్నారు.

మీడియా పాత్ర గొప్పది ..

అన్ని రంగాల అభివృద్ధి మీడియా పాత్ర గొప్పగా ఉంటుందని, ప్రజల అవసరాలను ప్రభుత్వానికి తెలియజేయడం.. ప్రభుత్వ నిర్ణయాలను ప్రజలకు తెలియజేయడమే కాకుండా కరోనా, ఎన్నికల లాంటి ప్రత్యేక పరిస్థితుల్లో కూడా మీడియా సేవలు గొప్పవన్నారు. ప్రజాస్వామ్యంలో నాలుగో స్తంభం మీడియా లేకపోతే సమాజం స్థిరంగా ఉండదన్నారు. ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం వల్ల మీడియాపై నమ్మకం మరింత బలపడుతుందన్నారు.



డ్రాయింగ్ వేసిన విద్యార్థినులతో ఆర్డీఓ ఉమారాణి, నిర్వాహకుడు మోహన్‌రావు

ఉద్యోగులందరూ సమానమే

- ఎవరైనా నేరుగా సమస్యలు చెప్పుకోవచ్చు
- కేయూ వీసీ కె. ప్రతాప్‌రెడ్డి

కేయూ క్యాంపస్: యూనివర్సిటీలో బోధన, బోధనేతర ఉద్యోగులందరూ తనకు సమానమేనని, ఎవరైనా నేరుగా తనను కలిసి సమస్యలు విన్నవించుకోవచ్చని, తనపరిధిలోని సమస్యలు పరిష్కరిస్తానని, మిగతావి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని కాకతీయ యూనివర్సిటీ వీసీ కె. ప్రతాప్‌రెడ్డి స్పష్టం చేశారు. బుధవారం రాత్రి కేయూ సెనేట్‌హాల్‌లో ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయిస్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉద్యోగుల పదోన్నతుల విషయంలో కమిటీ వేసి ఆ నివేదికల ఆధారంగానే పదోన్నతుల కల్పనకు ముందుకెళ్తానని స్పష్టం చేశారు. కేయూ ఎస్సీ,ఎస్టీ ఎంప్లాయిస్ అసోసియేషన్ అధ్యక్షుడు ప్రొఫెసర్ ఈసం నారాయణ, జనరల్‌సెక్రటరీ డాక్టర్ పుల్లా శ్రీనివాస్ మాట్లాడుతూ యూనివర్సిటీలోని కీలక పదవులను ఎస్సీ, ఎస్టీ ప్రొఫెసర్లకు రొటేషన్ ప్రకారం కేటాయించాలని కోరారు. అనంతరం అసోసియేషన్ బాధ్యులు వీసీ ప్రతాప్‌రెడ్డిని సన్మానించారు.

నైపుణ్యాలపై పట్టుసాధించాలి..

ప్రస్తుతం జాబ్ మార్కెట్‌లో పోటీ తట్టుకోవాలంటే హైటెక్ స్కిల్స్‌పై పట్టుసాధించాలని వీసీ కె. ప్రతాప్‌రెడ్డి అన్నారు.గురువారం కేయూలోని జియాలజీ విభాగం అధిపతి మల్లికార్జున్ రెడ్డి సారథ్యంలో ఆ విభాగంలో ఏర్పాటుచేసిన జియో ఇన్‌ఫర్మేషన్ సిస్టమ్ ల్యాబ్, ఇంటర్న్‌షిప్ ప్రోగ్రాంను ప్రారంభించి మాట్లాడారు. ప్రత్యేక అతిథులుగా అమెరికా సంయుక్త రాష్ట్రాల్లోని బోర్న్‌టెక్ సొల్యూషన్స్ సంస్థ చీఫ్ గ్రోత్ ఆఫీసర్ యుగంధర్ గూడూరు, శ్రీకాంత్ పారెపెల్లి, కేయూ రిజిస్ట్రార్ పి. మల్లారెడ్డి, యూనివర్సిటీ కాలేజి ప్రిన్సిపాల్ బి. సురేశ్‌లాల్,సైన్స్ కోర్సుల డీన్ జి. హనుమంతు తదితరులు పాల్గొన్నారు.



వీసీ ప్రతాప్‌రెడ్డిని సన్మానిస్తున్న ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంఘం బాధ్యులు, తదితరులు

బీసీ సమాజంపై బీజేపీకి చిత్తశుద్ధి లేదు

- బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్



మాట్లాడుతున్న జాజుల శ్రీనివాస్‌గౌడ్

కాజీపేట రూరల్ : తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వం చేపట్టిన కులగణనకు వ్యతిరేకంగా బీజేపీ కుట్రలు చేస్తోందని, బీసీ సమాజంపై ఆ పార్టీకి చిత్తశుద్ధి లేదని, కులగణన వ్యతిరేకిస్తున్న పార్టీలు ఖబడ్దార్ అని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ అన్నారు. శ్రీనివాస్ గౌడ్ చేపట్టిన కుల గణన చైతన్య యాత్రలో భాగంగా గురువారం కాజీపేట ఫాతిమానగర్ వైష్ణవిగ్రాండ్ హోటల్‌లో ఉమ్మడి జిల్లా బీసీ సంఘం అధ్యక్షుడు వడ్లకొండ వేణుగోపాల్ గౌడ్ అధ్యక్షతన బీసీ రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా జాజుల శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ కులగణన వ్యతిరేకిస్తున్న పార్టీలకు పుట్టగతులు ఉండవన్నారు. సంక్షేమ పథకాలకు సమగ్ర కులగణనకు ఎలాంటి సంబంధం లేదని, ప్రజలు భయాందోళనలు వీడాలన్నారు. బీసీ రిజర్వేషన్ల పెంపునకే రాష్ట్రంలో సమగ్ర కులగణన జరుగుతోందని, దీనివల్ల ఎవరికి నష్టం వాటిల్లదన్నారు. జాతీయ అధికార ప్రతినిధి తీగల ప్రదీప్‌గౌడ్ మాట్లాడుతూ కులగణనపై ప్రజలకు అవగాహన కల్పించాల్సిన బాధ్యత అన్ని కుల సంఘాలపై ఉందన్నారు. కలగణనను బీసీలు నిర్లక్ష్యం చేస్తే భవిష్యత్ తరాలను మోసం చేసినట్లేనన్నారు. బీసీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రవికృష్ణగౌడ్ మాట్లాడుతూ స్థానిక ఎన్నికల లోపు కులగణన పూర్తి చేయాలని, కులగణనను అడ్డుకోవాలని చూస్తే దేనికైనా తెగిస్తామని హెచ్చరించారు. రిటైర్డ్ ప్రొఫెసర్ కూరపాటి వెంకటనారాయణ మాట్లాడుతూ ప్రభుత్వం కులగణన పై ప్రజల్లో ఇంకా అవగాహన పెంచాలన్నారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కుల్కచర్ల శ్రీనివాస్‌ముదిరాజ్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు దాడి మల్లయ్యయాదవ్, బచ్చు ఆనందం, గౌడ రాష్ట్ర సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బొనగాని యాదగిరిగౌడ్, బీసీ సంఘం నాయకులు ఏడునూరి రాజమౌళి, అసిస్టెంట్ ప్రొఫెసర్ చిర్ర రాజు, బీసీ విద్యార్థి నాయకులు ఆరేగంటి నాగరాజు, డాక్టర్ కూరపాటి రమేశ్, అడ్వకేట్ సాయిని నరేందర్, తాడిశెట్టి క్రాంతి కుమార్, చిప్ప వెంకటేశ్వర్లు, జనగాం శ్రీనివాస్, కాసగాని అశోక్, మడిశెట్టి నాగరాజు పటేల్, తుపాకుల రవి, బీసీ సంఘం మహిళా నాయకులు మాధం పద్మజాదేవి, సులోచన, తదితరులు పాల్గొన్నారు.

కొజ్జోడు అన్నాడని.. నరికి చంపాడు

- భార్య, కుమారుడి కళ్లెదుటే ఘాతుకం
- డబ్బు లావాదేవీల విషయంలో గొడవ
- ఎల్లారెడ్డిగూడెంలో ఘటన



పరశురాములు (ఫైల్)



నిందితుడు మహేందర్

రఘునాథపల్లి: అప్పు చెల్లించమన్నందుకు కొజ్జోడు అని అవమానించాడని ఓ తాపీ మేస్త్రీని ఓ వ్యక్తి దారుణంగా నరికి చంపాడు. ఈ ఘటన గురువారం జనగామ జిల్లా రఘునాథపల్లి మండలం ఎల్లారెడ్డిగూడెంలో జరిగింది. పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన గంపల పరశురాములు (40) అదే గ్రామానికి చెందిన పర్వత మహేందర్ ఇంటి నిర్మాణ పనులు చేశాడు. మృతుడి భార్య సంధ్య.. భర్తతో పాటు పనికి వెళ్లేది. ఈ సమయంలో సంధ్య అనారోగ్యానికి గురైంది. వైద్య పరీక్షలు నిర్వహించగా క్యాన్సర్ అని నిర్ధారణ అయింది. దీంతో చికిత్స నిమిత్తం పరశురాములు.. మహేందర్ వద్ద రూ. 80 వేలు అప్పు తీసుకున్నాడు. పనుల కింద కొంత అప్పు చెల్లించగా మరి కొన్ని డబ్బులు ఇవ్వాల్సి ఉంది. పలుమార్లు అడిగినా ఇవ్వకపోవడంతో ఇటీవల ఇద్దరి మధ్య వాగ్వాదం జరిగింది. ఈ క్రమంలో తనను కొజ్జోడు అన్నాడని మహేందర్.. పరశురాములుపై పగ పెంచుకున్నాడు. బుధవారం రాత్రి మహేందర్ పలుమార్లు తన ఇంటికి రావాలని ఫోన్ చేయడంతో 12.45 గంటల సమయంలో పరశురాములు వెళ్లాడు. ఆయన వెనుక భార్య సంధ్య, కుమారుడు అనిరుధ్ వెళ్లారు. అప్పటికే కత్తితో సిద్ధంగా ఉన్న మహేందర్ తన ఇంటి ముందుకు పరశురాములు రాగానే నన్ను కొజ్జోడు అంటావా అంటూ తలపై దారుణంగా నరికాడు. దీంతో పరశురాములు అక్కడికక్కడే మృతి చెందాడు. హత్య చేసిన వెంటనే నిందితుడు పోలీసులకు లొంగిపోయినట్లు సమాచారం. దీనిపై సమాచారం అందుకున్న స్టేషన్‌ఘన్‌పూర్ ఏసీపీ భీంశర్మ, జనగామ రూరల్ సీఐ ఎడవెల్లి శ్రీనివాస్‌రెడ్డి, ఎస్సై నరేశ్ గ్రామానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జనగామ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై మృతుడి భార్య ఫిర్యాదుమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నరేశ్ తెలిపారు.

మొత్తుకున్నా.. ఒక్కరూ రాలేదు

తన భర్తను నరికేస్తుండగా లబోదిబోమని మొత్తుకున్నా ఏ ఒక్కరూ రాలేదని మృతుడి భార్య సంధ్య జనగామ ఆసుపత్రి వద్ద కన్నీటిపర్యంతమైంది. మొదటి కత్తి వేటు పడినప్పుడు గ్రామస్తులెవరైనా ముందుకు వచ్చి ఉంటే తన భర్త బతికేవాడని వాపోయింది. కాగా, హత్య ఘటన నేపథ్యంలో గ్రామంలో ఉద్రిక్తత పరిస్థితి నెలకొంది. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరుగకుండా పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు.

హాస్టల్ గదిలో గంజాయి

- రెడ్‌హ్యాండెడ్‌గా చిక్కిన ఐదుగురు విద్యార్థులు

హసన్‌పర్తి: వరంగల్ నగర శివారులోని ఓ ఇంజనీరింగ్ కళాశాల హాస్టల్ గదిలోనే గంజాయి తాగుతూ ఐదుగురు విద్యార్థులు పట్టుబడ్డారు. ఈ ఘటన గురువారం రాత్రి జరిగింది. కాలేజీ హాస్టల్ గదిలో విద్యార్థులు గంజాయి తాగుతున్నట్లు నార్కోటిక్ బృందానికి సమాచారం రాగా, హుటాహుటిన వారు కాలేజీకి వెళ్లి తనిఖీ చేశారు. ఐదుగురు విద్యార్థులు గంజాయి తాగుతుండగా పట్టుకున్నారు. అనంతరం గదిలో సోదాలు చేయగా గంజాయి ప్యాకెట్లు గుర్తించినట్లు తెలిసింది. పట్టుబడిన వారిలో ఇద్దరు బీటెక్ ద్వితీయ సంవత్సరం, ముగ్గురు తృతీయ సంవత్సరం విద్యార్థులున్నట్లు తెలిసింది. దీనిపై హసన్‌పర్తి పోలీసులను వివరణ కోరగా తమకు నార్కోటిక్ బృందంనుంచి ఎటువంటి సమాచారం అందలేదని తెలిపారు.

చేతి యంత్రాలతో విత్తనాలు విత్తుకోవచ్చు

- కృషి విజ్ఞాన కేంద్రం కోఆర్డినేటర్ డాక్టర్ రాజన్న



యంత్రం పనితీరును పరిశీలిస్తున్న రాజన్న

ఖిలా వరంగల్: చేతి యంత్రాలతో విత్తనాలను విత్తుకోవచ్చని మామునూరు కృషి విజ్ఞాన కేంద్రం కోఆర్డినేటర్ డాక్టర్ రాజన్న తెలిపారు. ఈమేరకు వరంగల్ మామునూరు పీవీనరసింహారావు పశు వైద్య కళాశాల ఆధ్వర్యంలో కృషి విజ్ఞానం కేంద్రం శాస్త్రవేత్తల నేతృత్వంలో గురువారం యాసంగి పంటలను పరిశీలించారు. అనంతరం దత్తగ్రామాలు ఎర్రబెల్లి, ఒంటిమామిడిపల్లి రైతులకు అటరీ డైరెక్టర్ షేక్ ఎస్.మీరాతో కలిసి రాజన్న చేతుల మీదుగా చేతితో విత్తనం విత్తే యంత్రాలను పంపిణీ చేశారు. అనంతరం డాక్టర్ రాజన్న మాట్లాడారు. ఈ యంత్రంతో 80 రకాల విత్తనాలు విత్తుకోవచ్చన్నారు. ప్రధానంగా మొక్కజొన్న, వేరుశనగ, పెసరు, ఆముదం, కంది వంటి విత్తనాలను విత్తుకోచ్చన్నారు. కార్యక్రమంలో సస్యరక్షణ శాస్త్రవేత్తలు రాజు, సౌమ్య, రైతులు వీరస్వామి తదితరులు పాల్గొన్నారు.

ఓపెన్ స్కూల్ ఉమ్మడి జిల్లా కోఆర్డినేటర్‌గా సదానందం



సదానందం

విద్యారణ్యపురి: ఓపెన్ స్కూల్ ఉమ్మడి వరంగల్ జిల్లా కోఆర్డినేటర్‌గా జయశంకర్ భూపాలపల్లి జిల్లా కొత్తపల్లిగోరి మండలం నిజాంపల్లి ఎంపీపీఎస్ ఎల్‌ఎఫ్‌ఎల్‌హెచ్‌ఎం అనగోని సదానందం నియమితులయ్యారు.ఈమేరకు పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ ఉత్తర్వులు జారీచేయగా బాధ్యతలు స్వీకరించినట్లు సదానందం గురువారం తెలిపారు. సదానందం 1989 డీఎస్సీలో ఎస్‌జీటీగా నియామకం కాగా కరీంనగర్‌జిల్లా సైదాపూర్ మండలంలో సుమారు 15 సంవత్సరాలు ఎంఆర్‌పీగా విధులు నిర్వర్తించారు.2013లో ఎల్‌ఎఫ్‌ఎల్ హెచ్‌ఎంగా పదోన్నతి పొందారు. రుద్రారం బాలునాయక్ తండాలోని పాఠశాలలో విధులు నిర్వర్తించారు. 317జీఓతో రేగొండ మండలం నిజాంపల్లి ఎంపీపీఎస్ ఎల్‌ఎఫ్‌ఎల్‌హెచ్‌ంగా విధులు నిర్వర్తిస్తున్నారు. ఇప్పటివరకు ఓపెన్ స్కూల్ కోఆర్డినేటర్‌గా విధులు నిర్వర్తిస్తున్న మురాలశంకర్‌రావు స్థానంలో తనను నియమించారని సదానందం తెలిపారు.

సాక్షి
ములుగు
శనివారం । 16 । నవంబర్ । 2024



మరింత జవాబుదారీగా..

విద్యుత్ వినియోగదారులకు మరింత మెరుగైన సేవలు అందించేందుకు ప్రత్యేకంగా టోల్‌ఫ్రీ నంబర్ 1912ను అందుబాటులోకి తీసుకువచ్చింది. - 10లో



ఇంట్లో దోషం ఉందని..

మీ ఇంట్లో దోషం ఉంది.. ఆ దోషాన్ని పోగొడుతానని నమ్మించి ఓ కుటుంబం నుంచి రూ.55లక్షలు వసూలు చేసింది ఓ హిజ్రా. - 10లో

గరిష్టం/కనిష్టం
31°/19°

వాతావరణం

జిల్లాలో ఉదయం సాధారణంగా ఉంటుంది. రోజంతా పొడి వాతావరణం ఉంటుంది. రాత్రి సమయంలో పొగమంచు కురియడంతో చలి తీవ్రత ఉంటుంది.

న్యూస్‌రీల్

రామప్పను సందర్శించిన ప్రముఖులు



వెంకటాపురం(ఎం): మండలంలోని చారిత్రాత్మక రామప్ప దేవాలయాన్ని కార్తీక పౌర్ణమి సందర్భంగా పలువురు ప్రముఖులు సందర్శించారు. అటవీశాఖ పీసీసీఎఫ్ సునితభగవత్, కేంద్ర స్త్రీ శిశు సంక్షేమ ఆదనపు కార్యదర్శి జ్ఞానేశ్ భర్తీ, జిల్లా వ్యవసాయ అధికారి తేజోవతి వేర్వేరుగా రామప్ప ఆలయాన్ని సందర్శించి రామలింగేశ్వరస్వామికి పూజలు చేశారు. టూరిజం గైడ్‌లు విజయ్‌కుమార్, వెంకటేశ్ వారికి ఆలయ విశిష్టతను వివరించగా రామప్ప శిల్పకళాసంపద బాగుందని కొనియాడారు.

సమస్యలు పరిష్కరించాలి



ములుగు: తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ నాల్గో తరగతి ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు గుగులోత్ రమేశ్ ఆధ్వర్యంలో శుక్రవారం ఏటూరునాగారం ఐటీడీఏ పీఓ చిత్రామిశ్రాకు వినతిపత్రం అందించారు. ఉద్యోగులకు దుస్తులు అందించాలని, ఔట్‌సోరింగ్ ఉద్యోగులకు, కాంటిజెంట్ వర్కర్లకు నెలవారీ వేతనం అందేలా చూడాలని కోరారు. సమస్యలపై పీఓ సానుకూలంగా స్పందించినట్లు రమేశ్ తెలిపారు.

నేడు విద్యుత్ అంతరాయం

ములుగు రూరల్: విద్యుత్ అంతరాయానికి వినియోగదారులు సహకరించాలని విద్యుత్ శాఖ డీఈ సదానందం శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నేడు(శనివారం) ఉదయం 09 గంటల నుంచి 12 గంటల వరకు 33/11 కేవీ ఉపకేంద్రాల మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు తెలిపారు. ములుగు, పత్తిపల్లి, అబ్బాపూర్, పందికుంట, పసర, కర్లపల్లి, నర్సాపూర్, తాడ్వాయి, కాటాపూర్, ఏటూరునాగారం, రాజుపేట, ఏటూర్, అలుబాక సబ్ స్టేషన్ల పరిధిలో అంతరాయం ఉంటుందని అన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

'గోర్ మఖావో'ను విజయవంతం చేయాలి



ములుగు: ఈ నెల 24, 25వ తేదీల్లో సంగారెడ్డి జిల్లా గుడితండాలో నిర్వహించనున్న గోర్ మఖావో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సేవాలాల్ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు పోరిక సునీల్‌కుమార్ పిలుపునిచ్చారు. గిరిజన బంజార బిడ్డలు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. ఈ మేరకు జిల్లాకేంద్రంలోని ఆర్ అండ్ బీ గెస్ట్‌హౌజ్‌లో మహబూబాబాద్ ఎంపీ పోరిక బలరాంనాయక్ శుక్రవారం కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సునీల్‌కుమార్ మాట్లాడుతూ.. ఏక్‌వాత్, ఏక్ జాత్, ఏక్ సాత్ నినాదంతో కులదైవాలు మేరమ్మయాడి, సేవాలాల్ మహరాజ్ చూపిన బాటలో నడవాలని సూచించారు. కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోత్ రవిచందర్, బోడ కిషన్‌నాయక్, పోరిక రాహుల్‌నాయక్, పాల్తీయ సారయ్య, పోరిక రాజ్‌కుమార్, పోరిక శ్యామెల్‌నాయక్, వినయ్, భూక్య రాజు, సంతోశ్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

బొగ్గు ఉత్పత్తి లక్ష్యసాధనకు కృషి



భూపాలపల్లి అర్బన్: ఏరియాలో ఈ ఆర్థిక సంవత్సరం నిర్దేశించిన బొగ్గు ఉత్పత్తి లక్ష్య సాధనకు కృషి చేయాలని కార్పొరేట్ ప్లానింగ్ అండ్ ప్రాజెక్ట్ విభాగం జీఎం మనోహర్ తెలిపారు. ఏరియాలో టార్గెట్ కమిటీ శుక్రవారం పర్యటించింది. ఈ సందర్భంగా ఏరియా జీఎం రాజేశ్వర్‌రెడ్డితో కలిసి బొగ్గు ఉత్పత్తి, వచ్చే ఏడాది సాధించాల్సిన లక్ష్యంపై చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బొగ్గు ఉత్పత్తి లక్ష్య సాధనకు అందరూ సమష్టిగా కృషిచేయాలని సూచించారు. 2025-26 ఆర్థిక సంవత్సరానికి నిర్దేశించిన లక్ష్యం, ప్రణాళికలు, బొగ్గు ఉత్పత్తి, ఓబీ రవాణా అంశాలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో అధికారులు కవీంద్ర, వెంకటరామరెడ్డి, భిక్షమయ్య, జోతి, రవికుమార్, మారుతి పాల్గొన్నారు.

కార్తీక శోభ

వెంకటాపురం(ఎం): రామలింగేశ్వరస్వామికి పూజలు నిర్వహిస్తున్న భక్తులు



వెంకటాపురం(కె): శివాలయంలో దీపాలు వెలిగిస్తున్న భక్తులు



ఏటూరునాగారం: ఉసిరిచెట్టు వద్ద దీపాలు వెలిగిస్తున్న మహిళలు



కార్తీక పౌర్ణమి నేపథ్యంలో శుక్రవారం ఆలయాలు కార్తీక శోభను సంతరించుకున్నాయి.. మహిళలు భక్తితో దీపాలు వెలిగించారు. గోదావరి పరివాహక ప్రాంత భక్తులు నదీ స్నానం ఆచరించి నదిలో దీపాలను వదిలారు. ఉసిరి, తులసి చెట్టు వద్ద పూజలు చేసి కోర్కెలు తీర్చాలని వేడుకున్నారు. – సాక్షి నెట్‌వర్క్

- వివరాలు 10లో, మరిన్ని ఫొటోలు 11లో

'ఓటు'పై స్పెషల్ డ్రైవ్!



మహిళా ఓటర్లే అధికం..

సుమారు ఎనిమిదిన్నర నెలల వ్యవధిలో కొత్తగా నమోదు చేసుకున్న ఓటర్లతో పాటు చనిపోయిన, ఇతర ప్రాంతాలకు మారిన వారిని తొలగిస్తూ.. అక్టోబర్ 29న రాష్ట్ర ఎన్నికల సంఘం డ్రాఫ్ట్ ఓటరు జాబితా ప్రకటించింది. ఈమేరకు ఉమ్మడి వరంగల్ జిల్లాలోని 12 శాసనసభ నియోజకవర్గాల్లో 14,86,220 మంది పురుష ఓటర్లు, 15,46,039 మంది మహిళలు, 499 ఇతరులు కలిపి మొత్తం 30,32,758 మంది ఓటర్లున్నట్లు పేర్కొన్నారు. ఈజాబితాలోనూ పురుషుల కంటే మహిళా ఓటర్లే 59,819 ఎక్కువగా ఉన్నారు. ఉమ్మడి వరంగల్‌లో చనిపోయిన, మరో ప్రాంతానికి మార్పిడి చేసుకున్న, రెండేసి ఓట్లు, ఇంకా ఇతర కారణాల తో 27,338 మంది పేర్లు తొలగించి, 55,219 మంది కొత్త ఓటర్లను చేర్చినట్లు ఎన్నికల సంఘం డ్రాఫ్ట్ జాబితాలో వెల్లడైంది. కాగా.. జాబితాపై అభ్యంతరాలుంటే ఫిర్యాదు చేయొచ్చని ప్రకటించిన ఎన్నికల సంఘం.. ఈనెల 28 వరకు అభ్యంతరాలు స్వీకరించేలా ఉదయం నుంచి సాయంత్రం వరకు పోలింగ్‌స్టేషన్లలో బూత్‌లెవెల్ అధికారులు (బీఎల్ఓలు) అందుబాటులో ఉండేలా ఆదేశించింది.

కొత్త ఓటర్ల నమోదుపై కలెక్టర్ల ప్రత్యేక దృష్టి

- డ్రాఫ్ట్ జాబితా ప్రకారం ఉమ్మడి జిల్లాలో 30.33 లక్షల ఓటర్లు
- ఎనిమిదిన్నర నెలల్లో కొత్త ఓటర్లు 55,219
- జనవరి వరకు మరింత పెరిగేలా కార్యాచరణ
- అర్హులు నమోదు చేసుకునేలా సదస్సులు

సాక్షిప్రతినిధి, వరంగల్:

కొత్త ఓటర్ల నమోదుపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. అర్హులంతా ఓటుహక్కును నమోదు చేసుకునేలా కార్యాచరణ అమలు చేస్తున్నారు. పల్లె, పట్నం తేడా లేకుండా అవగాహన కల్పించేందుకు క్యాంపెయిన్లు నిర్వహించనున్నారు. అక్టోబర్ 29న డ్రాఫ్ట్ ఓటర్ల జాబితాను ఎన్నికల సంఘం ప్రకటించిన విషయం తెలిసిందే. ఈజాబితా ప్రకారం.. ఉమ్మడి వరంగల్‌లోని 12 అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఓటర్ల సంఖ్య 30,32,758లకు చేరింది. 2023 ఫిబ్రవరి 8 నుంచి ఈ ఏడాది అక్టోబర్ 20 వరకు సుమారు ఎనిమిదిన్నర నెలల్లో కొత్తగా 55,219 మంది తమ ఓటు హక్కును నమోదు చేసుకున్నారు. అలాగే.. 27,338 ఓటర్లను అధికారులు వివిధ కారణాల చేత తొలగించారు. మరోమారు అర్హులైన వారు తమ ఓటును నమోదు చేసుకునేలా క్యాంపెయిన్లు నిర్వహించాలని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి (సీఈఓ) సుదర్శన్‌రెడ్డి జిల్లా అధికారులను ఆదేశించారు. ఈమేరకు ఈ నెల 9, 10 తేదీల్లో కలెక్టర్ల పర్యవేక్షణలో స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. వచ్చే ఏడాది జనవరి నాటికి అర్హులైన వారంతా తమ ఓటుహక్కును నమోదు చేసుకునేలా చూడాలన్న సీఈఓ తాజా ఆదేశాల మేరకు జిల్లాల్లో కలెక్టర్లు సదస్సులు, స్పెషల్ డ్రైవ్‌లు నిర్వహిస్తున్నారు.

హనుమకొండ, వరంగల్‌పై దృష్టి..

రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు 2025 జనవరి 6న ఓటర్ల తుది జాబితా ప్రకటించనున్నారు. ఇందుకోసం గత నెల 28న ప్రకటించిన డ్రాఫ్ట్ జాబితాపై ఈనెల 28 వరకు డ్రాఫ్ట్ జాబితాపై అభ్యంతరాలు స్వీకరిస్తూనే.. కొత్త ఓటర్ల నమోదు కోసం విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు. కాగా ఎనిమిదిన్నర నెలల్లో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఓటరు జాబితాలో కొత్తగా 55,219 మంది చేరగా... జనగామ 14,005, వరంగల్ 13,879, మహబూబాబాద్ 10,226, హనుమకొండ 8,708, ములుగు 4,475, భూపాలపల్లిలో 3926 మంది ఓటర్లు నమోదు చేసుకున్నారు. తొలగించిన ఓట్లు, కొత్తగా చేరిన ఓటర్లతో పోలిస్తే వ్యత్యాసం ఉండగా.. హనుమకొండ, వరంగల్ జిల్లాల్లో అర్హులైన ప్రతి ఒక్కరినీ ఓటరు జాబితాలో చేర్చేందుకు అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. ఈమేరకు స్వచ్ఛంద సంస్థలు, ఎన్‌జీఓలతో పాటు అధికారులతో తరచూ సమీక్షలు నిర్వహిస్తున్నారు.

డ్రాఫ్ట్ జాబితా ప్రకారం జిల్లాల వారీగా ఓటర్లు

జిల్లా	పురుషులు	మహిళలు	ఇతరులు	మొత్తం
హనుమకొండ	2,47,920	2,59,318	18	5,07,256
వరంగల్	3,76,330	3,94,440	369	7,71,139
జనగామ	3,73,667	3,84,289	26	7,57,982
మహబూబాబాద్	2,37,238	2,47,033	51	4,84,322
భూపాలపల్లి	1,36,778	1,40,649	08	2,77,435
ములుగు	1,14,287	1,20,310	27	2,34,624
మొత్తం	14,86,220	15,46,039	499	30,32,758

అర్హులు నమోదు చేసుకోవాలి..



కొత్త ఓటర్ల నమోదు కోసం విస్తృతంగా కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. ఓటర్లను చైతన్యపర్చడం, భాగస్వామ్యం చేయడంపై కలెక్టరేట్‌లో స్వీప్ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు నిర్వహించాం. అర్హత కలిగిన ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా ఓటుహక్కును నమోదు చేసుకోవాలి. ఓటు హక్కు కలిగిన ఓటర్లు ఎన్నికల్లో ఓటు హక్కును వినియోగించుకోవాలి.

– పి.ప్రావీణ్య, కలెక్టర్, హనుమకొండ

వరంగల్ వేదికగా...
ప్రజాపాలన విజయోత్సవం

- 19న ఓరుగల్లుకు సీఎం రేవంత్.. హనుమకొండ ఆర్ట్స్ కాలేజీలో భారీ సభ
- ముఖ్యమంత్రితోపాటు ఉప ముఖ్యమంత్రి, మంత్రుల హాజరు
- 22 జిల్లాల్లో మహిళా శక్తి భవనాలకు ఇక్కడినుంచే శ్రీకారం
- నగరంలో పలు పథకాలకు శంకుస్థాపన, ప్రారంభోత్సవం
- సీఎం సభ కోసం విస్తృతంగా ఏర్పాట్లు..
- కలెక్టర్‌లు, కమిషనర్‌లతో సీఎస్ భేటీ
- ఏర్పాట్లపై నేడు వరంగల్‌కు టీపీసీసీ చీఫ్, మంత్రులు



రూట్ మ్యాప్ పరిశీలిస్తున్న కలెక్టర్లు, సీపీ

సాక్షిప్రతినిధి, వరంగల్: కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాపాలన విజయోత్సవాలకు వరంగల్ వేదిక కానుంది. తెలంగాణలో ప్రభుత్వం ఏర్పడిన తొలి ఏడాది కాలంలో సాధించిన విజయాలు, చేపట్టిన కార్యక్రమాలు, వివిధ పథకాలను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని ప్రభుత్వం భావిస్తోంది. ఈ నేపథ్యంలో 'ప్రజాపాలన–ప్రజా విజయోత్సవ'సభను ఓరుగల్లులో నిర్వహించాలని భావించిన సీఎం రేవంత్ రెడ్డి.. శుక్రవారం హైదరాబాద్‌లో డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, పలువురు మంత్రులతో జరిపిన సమీక్షలో నిర్ణయించారు. ప్రజాపాలన విజయోత్సవాల సందర్భంగా డిసెంబర్ 9 వరకు కార్యక్రమాలను నిర్వహిస్తున్నప్పటికీ తొలిసభకు వరంగల్‌ను వేదిక చేసుకోవడంతో అధికారులు అప్రమత్తమయ్యారు. అదే రోజు వరంగల్ వేదిక నుంచి 22 జిల్లాల్లో ఇందిరా మహిళా శక్తి భవనాలకు సీఎం శంకుస్థాపన చేయనున్నారు. సీఎంతోపాటు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రుల వరంగల్ పర్యటన నేపథ్యంలో హెలిపాడ్, సభావేదికల ఏర్పాటు తదితరాలకు సంబంధించి రూట్ మ్యాప్ తయారీలో అధికార యంత్రాంగం బిజీ అయ్యింది.

హైదరాబాద్‌లో కలెక్టర్లతో సీఎస్ సమీక్ష..

ముఖ్యమంత్రి రేవంత్ వరంగల్ పర్యటన నేపథ్యంలో ఏర్పాట్లను వరంగల్ పశ్చిమ నియోజకవర్గం ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, హనుమకొండ, వరంగల్ జిల్లాల కలెక్టర్లు ప్రావీణ్య, సత్యశారద, పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా, బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే శుక్రవారం పరిశీలించారు. సీఎం రాక మొదలుకుని అభివృద్ధి పనుల ప్రారంభోత్సవం, శంకుస్థాపన, పనుల సమీక్ష, తిరిగి హెలికాప్టర్ ద్వారా హైదరాబాద్ బయలుదేరే వరకూ షెడ్యూల్ ప్రకారం పర్యటన సాగేలా ఏర్పాట్లను గురించి వారు చర్చించారు. హెలిపాడ్‌తో పాటు సభను నిర్వహించే ఆర్ట్స్ కళాశాల మైదానం, బాలసముద్రంలోని కాళోజీ కళాక్షేత్రం, కాజీపేట ఆర్వోబీని పరిశీలించారు. ఇదిలా ఉండగా హైదరాబాద్‌లో కలెక్టర్‌లు, కమిషనర్‌లతో సీఎస్ అత్యవసర సమావేశం ఏర్పాటు చేశారు. దీంతో హుటాహుటిన శుక్రవారం సాయంత్రం రెండు జిల్లాల కలెక్టర్లు సత్యశారద, ప్రావీణ్య, పోలీసు కమిషనర్ అంబర్ కిషోర్ ఝా, ఉన్నతాధికారులు హైదరాబాద్‌కు తరలివెళ్లారు. సచివాలయం ఆవరణలో రాత్రి వరకు రాష్ట్ర అటవీ, పర్యాటకశాఖ మంత్రి కొండా సురేఖ, సీఎం సలహాదారుడు వేం నరేందర్ రెడ్డి, సీఎస్ శాంతికుమారి తదితరులు అధికారులతో సమీక్ష నిర్వహించారు. సీఎం పర్యటన, రూట్ మ్యాప్, సభావేదిక ఏర్పాటు తదితర అంశాలపైన సుదీర్ఘంగా చర్చ జరిగినట్లు తెలిసింది.

నేడు హనుమకొండకు పీసీసీ చీఫ్, మంత్రులు

ప్రజాపాలన విజయోత్సవ సభ, సీఎం పర్యటన సందర్భంగా ఏర్పాట్లను పరిశీలించేందుకు టీపీసీసీ అధ్యక్షుడు బొమ్మ మహేశ్‌కుమార్, మంత్రులు శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్, సీఎం సలహాదారుడు వేం నరేందర్ రెడ్డి శనివారం హనుమకొండకు వస్తున్నట్లు వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే, డీసీసీ అధ్యక్షుడు నాయిని రాజేందర్ రెడ్డి తెలిపారు. సీఎం పర్యటన సందర్భంగా ఏర్పాట్లు జరుగుతున్నాయని, రెండు రోజులుగా కలెక్టర్‌లు, పోలీసు, మున్సిపల్ కమిషనర్‌లు, ఇతర ఉన్నతాధికారులను సమన్వయం చేసుకుంటూ ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆయన చెప్పారు. కాగా టీపీసీసీ అధ్యక్షుడు బొమ్మ మహేశ్‌కుమార్‌తో పాటు మంత్రులు హెలిపాడ్, సభావేదిక, కాళోజీ కళాక్షేత్రం, కాజీపేట ఆర్వోబీ తదితర ప్రాంతాల్లో ఏర్పాట్లను పరిశీలిస్తారు. అనంతరం కాంగ్రెస్ పార్టీ ప్రజాప్రతినిధులు, ముఖ్యనేతలతో భేటీ కానున్నారు. విజయోత్సవ సభ, సీఎం పర్యటన సక్సెస్ కోసం జనసమీకరణపై చర్చించనున్నారు.

మావోయిస్టుల కదలికలపై నిఘా పెంచాలి



సిబ్బంది సామగ్రిని పరిశీలిస్తున్న ఎస్పీ శబరీశ్



రైతులతో మాట్లాడుతున్న ఎస్పీ శబరీశ్

- ఎస్పీ డాక్టర్ శబరీశ్
- తాడ్వాయి పోలీస్ స్టేషన్ తనిఖీ

ఎస్ఎస్‌తాడ్వాయి: తాడ్వాయి పోలీస్ స్టేషన్ పరిసర ప్రాంతాలు భద్రాద్రి కొత్తగూడెం, బయ్యారం అడవులతో సరిహద్దును కలిగి ఉన్నందున మావోయిస్టుల కదలికలపై నిఘా ఉంచాలని ఎస్పీ డాక్టర్ శబరీశ్ అన్నారు. వార్షిక తనిఖీల్లో భాగంగా శుక్రవారం మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌ను ఆయన తనిఖీ చేశారు. స్టేషన్‌లోని రికార్డులను పరిశీలించి కేసుల నమోదు వాటి స్థితిగతులను తెలుసుకున్నారు. పెండింగ్ కేసులను త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. పోలీస్ స్టేషన్ సిబ్బంది కిట్ ఆర్టికల్స్, ఆయుధ సామగ్రి, సిబ్బంది నైపుణ్యాన్ని తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఎస్పీ శబరీశ్ మాట్లాడుతూ.. గొత్తికోయలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. గంజాయి రవాణాపై దృష్టి సారించాలని, మావోయిస్టు ప్రభావిత ప్రాంతంలో ఉన్నందున ప్రజల భద్రత కోసం చర్యలు తీసుకోవాలన్నారు. బాధిత వ్యక్తుల నుంచి ఫిర్యాదును స్వీకరించిన అనంతరం వారికి వెంటనే రసీదు అందించాలని చెప్పారు. ఎఫ్ఐఆర్ నమోదు, కేసుల దర్యాప్తు నిష్పక్షపాతంగా నిర్వహించాలని ఆదేశించారు. రోడ్డు ప్రమాదాలను నివారించేందుకు రేడీయం టెప్‌లను ఎక్కువగా అమర్చాలన్నారు. జాతీయ రహదారి 163 అడవిలో ఉన్నందున్న అసాంఘిక కార్యక్రమాలకు తావు లేకుండా నిరంతరం నిఘా పెంచాలన్నారు. పోలీస్ స్టేషన్ ఆవరణలో ఉన్న వాహనాల వివరాలను అడిగి తెలుసుకున్నారు. సిబ్బంది క్రమశిక్షణతో పని చేయాలని, విధులలో నిర్లక్ష్యం చేస్తే శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. పోలీస్ స్టేషన్ సిబ్బంది సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సమస్యల పరిష్కార దిశగా ఆదేశాలు జారీ చేశారు. కార్యక్రమంలో ములుగు డీఎస్పీ రవీందర్, పస్రా సీఐ రవీందర్, ఎస్సై శ్రీకాంత్ రెడ్డి పోలీస్ స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం పరిశీలన..

గోవిందరావుపేట: మండల కేంద్రంలోని వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని శుక్రవారం ఎస్పీ శబరీశ్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన రైతులతో మాట్లాడుతూ.. దళారీలకు పంట అమ్మకూడదని, ప్రభుత్వం సూచించిన కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించుకోవాలని సూచించారు. దళారీల చేతిలో ఎవరు మోసపోవద్దన్నారు. కొనుగోలు కేంద్రం నిర్వాహకులను వివరాలను అడిగి తెలుసుకున్నారు. రైతులకు భరోసా కల్పిస్తూ కొనుగోలు కేంద్రంలో అన్నదాతలకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా పోలీస్ అధికారులు జిల్లా అధికారులతో కలిసి సమన్వయంతో పని చేస్తారని అన్నారు. ఏదైనా సమస్య ఉంటే వెంటనే అధికారుల దృష్టికి తీసుకొస్తే పరిష్కరిస్తామని అన్నారు. కార్యక్రమంలో ములుగు డీఎస్పీ రవీందర్, పస్రా సీఐ రవీందర్, ఎస్సై కమలాకర్, రైతులు పాల్గొన్నారు.

పోరాటయోధుల ఆశయాలు కొనసాగించాలి

- ఘనంగా జన్ జాతీయ గౌరవ్ దివస్ వేడుకలు
- పాల్గొన్న పలువురు ప్రముఖులు



బిర్సా ముండా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న ఎంపీ బలరాంనాయక్, హుస్సేన్‌నాయక్, బెల్లయ్యనాయక్, కలెక్టర్



ఎంపీ బలరాంనాయక్‌కు జ్ఞాపికను అందజేస్తున్న ఐటీడీఏ పీఓ చిత్రామిశ్రా



గిరిజనుల గుస్సాడి నృత్య ప్రదర్శన

ములుగు రూరల్: పోరాట యోధుల ఆశయాలను కొనసాగించాలని జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు జాటోత్ హుస్సేన్ నాయక్, మహబూబాబాద్ ఎంపీ పోరిక బలరాంనాయక్, ట్రైకార్ నాయక్ బెల్లయ్య నాయక్ అన్నారు. ఈ మేరకు శుక్రవారం మండలంలోని జాకారం సమ్మక్క– సారక్క గిరిజన కేంద్రియ విశ్వవిద్యాలయంలో నిర్వహించిన జన్ జాతీయ గౌరవ్ దివాస్ వేడుకలను కలెక్టర్ టీఎస్ దివాకర ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ముందుగా బిర్సాముండా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బిర్సాముండా జయంతి వేడుకలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలో నిర్వహించినట్లు తెలిపారు. బిర్సాముండా ఆదివాసీ గిరిజనుల భూమి, నీరు, ఆదివాసి హక్కుల కోసం పోరాడిన మహోన్నత వ్యక్తి అని కొనియాడారు. భూమి శిస్తును వ్యతిరేకిస్తూ గిరిజన జాతి అభ్యున్నతికి నిరంతరం పోరాటం చేశారని వీరుల పోరాట స్ఫూర్తిని ఆదర్శంగా తీసుకోవాలని అన్నారు. కేంద్ర ప్రభుత్వం గిరిజనుల సంక్షేమం కోసం రూ.78వేల 600 కోట్ల నిధులను కేటాయించిందని అన్నారు. నిధులతో గ్రామాల్లో పలు అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టడం జరుగుతుందన్నారు. బిర్సా ముండా బ్రిటిష్ పాలకులకు వ్యతిరేకంగా పోరాడి 'మన సంస్కృతి.. మన విధానం' అనే నినాదంతో గిరిజనులను ఏకతాటిపై నడిపించారని గుర్తు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం గిరిజనుల అభివృద్ధికి రూ.360 కోట్ల నిధులను కేటాయించిందని అన్నారు. జిల్లాలో ఏర్పాటు చేసిన గిరిజన యూనివర్సిటీలో 80శాతం సీట్లను ఎస్టీలకు కేటాయించాలని ఎంపీ బలరాంనాయక్ అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ఆదివాసీ గిరిజనుల అభివృద్ధికి కట్టుబడి ఉన్నారని అన్నారు. ఈసందర్భంగా ట్రైబల్ మ్యూజియం ఆధ్వర్యంలో చేపట్టిన గుస్సాడి, కొమ్ముకోయ, బంజార నృత్యాలు ఆకట్టుకున్నాయి. అనంతరం వివిధ విభాగాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు సర్టిఫికెట్లు, బహుమతులను అందించారు. పెసా చట్టం ప్రకారం గ్రామాల్లో అన్నివిధాలుగా ఓడీఎఫ్, జన్‌ధన్ ఖాతాలు, ఆధార్ ఎన్‌రోల్ వంటి కార్యక్రమాల్లో ముందున్న అకినపల్లి మల్లారం, పస్రా, రాయినిగూడెం గ్రామాలకు అవార్డులను అందించారు. కార్యక్రమంలో గిరిజన సంక్షేమ శాఖ సెక్రటరి శరత్, అదనపు కార్యదర్శి జ్ఞానేశ్ భారతి, ఐటీడీఏ పీఓ చిత్రామిశ్రా, డీఎఫ్ఓ రాహుల్ కిషన్ జాదవ్, ట్రైబల్ వెల్ఫేర్ అదనపు డైరెక్టర్ సర్వేశ్వర్ రెడ్డి, గ్రంథాలయ చైర్మన్ బానోత్ రవిచందర్, అదనపు కలెక్టర్ మహేందర్ జీ, ఆర్డీఓ వెంకటేశ్వర్లు, యూనివర్సిటీ ఎగ్జామినేషన్ కంట్రోలర్ తుకారాం, డీడీ పోచం, ఆదివాసీ నాయకులు పాల్గొన్నారు.

త్రివేణి గోదావరికి హారతి



కాళేశ్వరం: కార్తీక పౌర్ణమిని పురస్కరించుకొని గోదావరి నదికి హారతి కార్యక్రమాన్ని కాళేశ్వరంలోని శ్రీకాళేశ్వర ముక్తీశ్వరస్వామి ఆలయంలో ప్రధాన అర్చకుడు త్రిపురారి కృష్ణమూర్తిశర్మ ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ముందుగా ప్రధాన ఆలయం నుంచి త్రివేణి సంగమ గోదావరి నదికి మంగళవాయిద్యాలతో వేద మంత్రోచ్ఛరణల మధ్యన తరలివెళ్లారు. గోదావరి మాతకు ప్రత్యేకంగా పూజాకార్యక్రమాలు నిర్వహించారు. గోదావరిమాతకు పాలు, పండ్లు, పసుపు, కుంకుమతో పాటు సారెను సమర్పించారు. హారతులతో పాటు కుంభ హారతిని నిర్వహించారు.

జలాభిషేకాలు..దీపారాధనలు

అఖండ జ్యోతి దర్శనం



పాలకుర్తి టౌన్ : అఖండ జ్యోతిని వెలిగిస్తున్న ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి, స్వామి స్థితప్రజ్ఞానంద సరస్వతి

పాలకుర్తి టౌన్: కార్తీక పౌర్ణమి పురస్కరించుకుని జనగామ జిల్లా పాలకుర్తిలో పరమ శివుడు జ్యోతి రూపంలో శబరిమలై మకరజ్యోతిని తలపించేలా దక్షిణ భారతదేశంలో మూడో అఖండజ్యోతి భక్తులకు దర్శనమిచ్చింది. శుక్రవారం రాత్రి 7.15 శ్రీసోమేశ్వర లక్ష్మీనర్సింహస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో అఖండ జ్యోతిని నిర్వహించారు. ప్రారంభ కార్యక్రమానికి ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి, ఉత్తరకాశి పీఠాధిపతి శ్రీశ్రీశ్రీ స్వామి స్థితప్రజ్ఞానంద సరస్వతి పారంభిచారు. గుట్టపైనున్న శిఖరంపై అఖండ జ్యోతిని వెలిగించారు. అఖండ జ్యోతిని భక్తులు పెద్ద ఎత్తున దర్శించుకుని పునీతులయ్యారు. జనగామ డీసీపీ రాజమహేంద్రనాయక్, ఆలయ ఈఓ సల్వాది మోహన్‌బాబు, దేవాదాయశాఖ ఇన్‌స్పెక్టర్ వెంకటలక్ష్మీ, సూపరింటెండెంట్ కొత్తపల్లి వెంకటయ్య అర్చకులు పాల్గొన్నారు.



కోటిపోగులతో తయారుచేసిన దీపం

కాళేశ్వరం : గోదావరిలో పుణ్యస్నానాలు చేస్తున్న భక్తులు



హన్మకొండ కల్చరల్ : రుద్రేశ్వరస్వామికి పూజలు నిర్వహిస్తున్న వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి దంపతులు, మేయర్ సుధారాణి



ఘనంగా కార్తీకపౌర్ణమి వేడుకలు



ఉసిరి చెట్టు వద్ద దీపాలు వెలిగిస్తున్న భక్తులు

- ఆలయాల్లో కిక్కిరిసిన భక్తులు
- త్రివేణి సంగమంలో పుణ్యస్నానాలు

కాళేశ్వరం: భూపాలపల్లి జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన కాళేశ్వరంలోని శ్రీకాళేశ్వరముక్తీశ్వరస్వామి ఆలయం కార్తీక పౌర్ణమి సందర్భంగా భక్తులతో కిటకిటలాడింది. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల నుంచి భక్తులు భారీగా తరలివచ్చారు. తెల్లవారుజాము నుంచే త్రివేణి సంగమ గోదావరిలో పుణ్యస్నానాలు ఆచరించారు. గోదావరి మాతకు ఇసుకతో సైకత లింగాలు చేసి పూజలు చేశారు. గోదావరిలో దీపాలు వదిలారు. అనంతరం ఆలయంలో స్వామివారి గర్భగుడిలో అభిషేకాది అర్చన పూజలు నిర్వహించారు. ఉసిరిచెట్టు వద్ద ప్రదక్షిణలు చేసి లక్ష ఒత్తులు వెలిగించి, లక్ష ముగ్గులు వేశారు. సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాలు, ఉపవాసదీక్షలు నిర్వహించారు. దీంతో ఆలయంతో పాటు గోదావరి తీరంలో భక్తులు ఆధ్యాత్మికత వాతావరణం నెలకొంది. సుమారు 60 వేల మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. ఈఓ మారుతి, సూపరింటెండెంట్ శ్రీనివాస్ ఆలయంలోనే ఉండి భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చర్యలు చేపట్టారు. శుక్రవారం ఒక్క రోజు వివిధ పూజలు, లడ్డూ ప్రసాదాల ద్వారా సుమారు రూ.9 లక్షల వరకు ఆదాయం సమకూరినట్లు ఈఓ పేర్కొన్నారు.



వెంకటాపురం(ఎం): : రామప్ప రామలింగేశ్వరస్వామికి అభిషేక పూజలు నిర్వహిస్తున్న భక్తులు


రామప్పలో కార్తీక పౌర్ణమి సందడి

వెంకటాపురం(ఎం): మండలంలోని చారిత్రాత్మక రామప్ప దేవాలయంలో కార్తీక పౌర్ణమి సందర్భంగా కుటుంబసమేతంగా భక్తులు అధికసంఖ్యలో తరలివచ్చి రామలింగేశ్వరస్వామికి అభిషేకం పూజలు నిర్వహించారు. ఆలయ పూజారులు హరీష్‌శర్మ, ఉమాశంకర్‌లు భక్తులకు తీర్థప్రసాదాలు అందించి ఆశీర్వచనం చేశారు. ఆలయ ఆవరణలోని మారేడు చెట్టు, మామిడిచెట్టు కింద మహిళలు భక్తిశ్రద్ధతో దీపాలు వెలిగించి దీపారాధన చేశారు. ఒక్కొక్కరూ 365 ఒత్తులు వెలిగించారు. సుమారు 10 వేలకు పైగా భక్తులు ఆలయానికి తరలివచ్చినట్లు ఆలయ అధికారులు పేర్కొన్నారు.



వెంకటాపురం(ఎం): మారేడు చెట్టు కింద దీపాలు వెలిగిస్తున్న మహిళలు

వేయిస్తంభాల ఆలయంలో దర్శనం కోసం క్యూలో భక్తులు



వేయిస్తంభాల దేవాలయంలో..



హన్మకొండ కల్చరల్ : శ్రీరుద్రేశ్వరస్వామి వారి వే యిస్తంభాల దేవాలయంలో శుక్రవారం కార్తీకపౌర్ణమిని పురస్కరించుకుని లక్షదీపోత్సవ వేడుకలు వైభవంగా జరిగాయి. శుక్రవారం ఉదయం 5 గంటల నుంచి ఆలయప్రధానార్చకులు గంగు ఉపేంద్రశర్మ ఆధ్వర్యంలో వేద పండితులు మణికంఠశర్మ, అర్చకులు పానుగంటి ప్రణవ్, సందీప్‌శర్మలు ప్రభాతసేవ, మంగళభేరి జరిపి మూలగణపతికి ఫలోదక నారికేళ జలాభిషేకం, శ్రీరుద్రేశ్వరునికి అఘోర పాశుపత ఏకాదశ రుద్రాభిషేకం నిర్వహించారు. ఈఓ వెంకటయ్య ఏర్పాట్లను పర్యవేక్షించారు.

శోభాయమానంగా లక్షదీపోత్సవం..

వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, నగర మేయర్ గుండు సుధారాణి దేవాలయాన్ని సందర్శించారు. వారిని ఆలయ ఈఓ వెంకటయ్య, గంగు ఉపేంద్రశర్మలు ఆలయ మర్యాదలతో స్వాగతించారు. స్వామివారికి అభిషేకం నిర్వహించిన అనంతరం వారికి అర్చకులు తీర్థప్రసాదా లు, శేష వస్త్రాలు, మహా దాశీర్వచనం అందజేశారు. జ్యోతిప్రజ్వలన చేసి లక్షదీపోత్సవం కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం వారు దేవాలయంలోని ప్రాచీన కోనేరులో అరటి దొప్పలలో కార్తీకదీపాలను వెలిగించారు. సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా కూచిపూడి నృత్యప్రదర్శనలు, అన్నమయ్య కీర్తలు తదితర కార్యక్రమాలు పలువురిని అలరించాయి. మహేష్ బాబు, సాంబయ్య, గాయత్రి గ్రానైట్స్ అధినేత వద్దిరాజు వెంకటేశ్వర్లు, వరంగల్ విద్యుత్‌శాఖ విజిలెన్స్ ఎస్పీ జనార్దన్, పవన్, రంజిత్‌రెడ్డి పాల్గొన్నారు.

భద్రకాళిలో జ్వాలాతోరణం

భద్రకాళి ఆలయంలో కార్తీకపౌర్ణమిని పురస్కరించుకుని అర్చకులు భద్రకాళి శేషు ఆధ్వర్యంలో అమ్మవా రికి ప్రత్యేక పూజ లు జరిగాయి. శ్రీభద్రేశ్వరస్వామికి అభిషేకాలు, బిల్వార్చనలు జరి గా యి. ఉదయం అరుణాచలం అంతకర్జ్ఞాన నిలయం ఆశ్రమం శ్రీ బ్రహ్మాత్మనంద స్వామి అమ్మవారిని దర్శించుకున్నారు. రాత్రి దేవాలయ ఆవరణలో జ్వాలాతోరణాన్ని వెలిగించారు. ఎమ్మెల్యే నాయిని పాల్గొని జ్యోతిప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈఓ శేషుభారతి ఏర్పాట్లను పర్యవేక్షించారు. కోటిపోగులతో తయారుచేసిన దీపం వెలిగించారు.



భద్రకాళి దేవాలయంలో జ్వాలాతోరణం



వేయిస్తంభాల గుడిలో దీపాలు వెలిగిస్తున్న భక్తులు

వరుస చోరీలు.. నిందితుడి అరెస్ట్

- రూ.6.90 లక్షల విలువైన బంగారు, వెండి అభరణాలు స్వాధీనం



వివరాలు వెల్లడిస్తున్న పోలీసులు

పరకాల: వరుస చోరీలకు పాల్పడుతున్న ఒకరిని పరకాల పోలీసులు శుక్రవారం అరెస్ట్ చేశారు. నిందితుడి నుంచి కామారెడ్డిపల్లెలో దొంగతనం చేసిన నగలను స్వాధీనం చేసుకున్నట్లు వరంగల్ ఈస్ట్ జోన్ డీసీపీ పి.రవీందర్ తెలిపారు. పరకాల పోలీసు స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన నిందితుడి అరెస్టు వివరాలు వెల్లడించారు. హనుమకొండ జిల్లా పలివేల్పుల గ్రామానికి చెందిన మిరియాల భాస్కర్ కూలీ పని చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఆర్థిక ఇబ్బందులు వెంటాడడంతో తక్కువ సమయంలో ఎక్కువ సంపాదించడానికి చోరీలు చేయాలని నిర్ణయించుకున్నాడు. హనుమకొండ, గూడూరు, కేశవపట్నం, మంథని, జమ్మికుంట, కాల్వశ్రీరాంపూర్, పోత్కపల్లి పోలీస్‌స్టేషన్ల పరిధిలో పగటి సమయంలో ఇంట్లో ఎవరూ లేని సమయంలో దొంగతనాలు చేయడం ప్రారంభించాడు. అతడిపై ఆయా పోలీస్ స్టేషన్లలో కేసులు నమోదయ్యాయి. శుక్రవారం వెల్లంపల్లి రోడ్డులో పరకాల పోలీసులు తనిఖీలు నిర్వహిస్తుండగా.. భాస్కర్ ద్విచక్రవానంపై అనుమానాస్పదంగా కనిపించాడు. దీంతో పరకాల పోలీసులు అతడిని అదుపులోకి తీసుకొని విచారించారు. ఈనెల 23న పరకాల మండలం కామారెడ్డి గ్రామంలో ఓ ఇంట్లో చోరీ చేసినట్లుగా గుర్తించారు. అతడి నుంచి రూ.6.80 లక్షల విలువైన బంగారు ఆభరణాలు, రూ.10 వేల విలువైన వెండి నగల్ని స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిపై కేసు నమోదు చేశారు. నిందితుడిని చాకచక్యంగా పట్టుకున్న పరకాల సీఐ క్రాంతికుమార్, ఎస్సైలు ఎస్.శివకృష్ణ, ఎం.రమేశ్‌ను డీసీపీ రవీందర్, ఏసీపీ కిషోర్‌కుమార్ అభినందించారు.

'డయల్ యువర్ ఆర్ఎం'కు విశేష స్పందన

కాజీపేట అర్బన్ : వరంగల్ రీజియన్ పరిధిలో శుక్రవారం నిర్వహించిన డయల్ యువర్ ఆర్ఎం కార్యక్రమానికి విశేష స్పందన లభించిందని ఆర్ఎం విజయభాను తెలిపారు. రీజియన్ పరిధిలోని వివిధ ప్రదేశాల నుంచి ప్రయాణికులు ఫోన్ ద్వారా ఆర్ఎంతో మాట్లాడి సలహాలు, సూచనలు అందజేశారు. కార్యక్రమంలో భాగంగా కాళేశ్వరం నుంచి విజయరెడ్డి ఫోన్‌లో హనుమకొండ నుంచి కాళేశ్వరం ప్రయాణ సమయం తగ్గించడంతో పాటు నాన్‌స్టాప్ బస్సులు కావాలని తెలిపారు. భూపాలపల్లి నుంచి హరికృష్ణ ఫోన్‌లో సాయంత్రం 5 నుంచి 6 గంటల మధ్యలో భూపాలపల్లి నుంచి బస్సుల సంఖ్య పెంచాలన్నారు. సిద్దిపేట నుంచి శైలజ హనుమకొండ నుంచి సిద్దిపేటకు డీలక్స్ బస్సులను నడిపిస్తున్నందుకు కృతజ్ఞతలు తెలిపారు. సిద్దిపేట నుంచి సంతోష సిద్దిపేటకు తక్కువ స్టాప్‌లతో మరో బస్సు కావాలని కోరారు. దామోదర్ సిద్దిపేట నుంచి వరంగల్ వరకు బస్సులను నడపాలని చెప్పారు. ప్రయాణికుల సలహాలు, సూచనలను పరిగణలోకి తీసుకుని బస్సు సర్వీసులను నడపనున్నట్లు ఆర్ఎం విజయభాను తెలిపారు.

రైలు ఢీకొని ఉద్యోగి దుర్మరణం



శివకుమార్ (ఫైల్)

కమలాపూర్ : కమలాపూర్ మండలంలోని ఉప్పల్ రైల్వేస్టేషన్ సమీపంలో శుక్రవారం రైలు ఢీకొన్న ప్రమాదంలో రంపీస శివకుమార్ (34) రైల్వే ఉద్యోగి దుర్మరణం చెందాడు. కాజీపేట జీఆర్‌పీ హెడ్ కానిస్టేబుల్ కె.భాస్కర్ తెలిపిన వివరాల ప్రకారం.. శివకుమార్ రైల్వేశాఖలో ఎస్ఎస్ఈ/టీఆర్‌డీ/కాజీపేట కింద టీఆర్‌డీ/జమ్మికుంట (ఓహెచ్ఈ) అసిస్టెంట్ (హెల్పర్)గా విధులు నిర్వహిస్తున్నాడు. విధి నిర్వహణలో భాగంగా ఉప్పల్ రైల్వే స్టేషన్ సమీపంలోని 343/సీ14–సీ15 కిలోమీటరు నంబర్ దగ్గర ఓహెచ్ విద్యుత్ లైన్ల మెయింటెనెన్స్‌ను పరిశీలిస్తుండగా కాజీపేట వైపు వెళ్తున్న 22648 నంబర్ గల కొచివెల్–కోర్బా ఎక్స్‌ప్రెస్ శివకుమార్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో శివకుమార్ అక్కడికక్కడే మృతి చెందినట్లు జీఆర్‌పీ హెడ్ కానిస్టేబుల్ భాస్కర్ తెలిపారు.

మరింత జవాబుదారీగా..

- అందుబాటులోకి టోల్ ఫ్రీ నంబర్ 1912
- విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లపై ముద్రణ
- వినియోగదారులకు విస్తృతంగా టోల్ ఫ్రీ సేవలు

హన్మకొండ : విద్యుత్ వినియోగదారులకు మెరుగైన, నాణ్యమైన సేవలు అందించడమే లక్ష్యంగా టీజీ ఎన్పీడీసీఎల్ యాజమాన్యం మరింత జవాబుదారితనంతో ముందుకెళ్తోంది. సేవల్లోనూ పారదర్శకతకు పెద్దపీట వేసింది. క్షేత్ర స్థాయి అధికారులు తీర్చలేని సమస్యను, తీర్చగలిగే అవకాశమున్నా కావాలని కాలయాపన చేయడం, బాధ్యతారాహిత్యంగా ప్రవర్తిస్తూ, నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ, ఇతరత్రా వినియోగదారులను ఇబ్బందులు పెడితే.. ఆ సమస్యను కార్పొరేట్ కార్యాలయం ద్వారా తీర్చుకునే అవకాశం కల్పించింది. ఈ దిశగా అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటోంది. వినియోగదారులకు ఏ చిన్న సమస్య వచ్చినా వెంటనే పరిష్కారం చూపేలా వినియోగదారుల ముంగిటకు సేవలు తీసుకెళ్తోంది. అధికారులు, సిబ్బంది ఫోన్ నంబర్లు గుర్తుంచుకోలేని వినియోగదారుల కోసం ప్రత్యేకంగా టోల్ ఫ్రీ నంబర్ 1912ను అందుబాటులోకి తీసుకొచ్చింది. దీనికి మరింత విస్తృత ప్రచారం కల్పిస్తూ నిత్యం వినియోగదారుల మధ్యలో ప్రతిబింబించేలా ప్రతి డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్‌పై టోల్ ఫ్రీ నంబర్ 1912ను ముద్రిస్తున్నారు. దీంతో రైతులు, విద్యుత్ వినియోగదారులు నంబర్ గుర్తులేకపోయినా వెంటనే ట్రాన్స్‌ఫార్మర్ వద్దకు చేరుకుని నంబర్ తెలుసుకునే వెసులుబాటు కల్పించింది. ఈ నంబర్‌కు ఫోన్ చేస్తే సత్వర పరిష్కారం లభించేలా ఏర్పాట్లు చేశారు.



విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌పై ముద్రించిన టోల్ ఫ్రీ నంబర్

ప్రధాన కార్యాలయం నుంచి టోల్ ఫ్రీ సేవలు..

ఆధునిక సాంకేతికతను జోడించి వినియోగదారులకు సేవలు అందుబాటులోకి తీసుకొచ్చారు. ఎన్పీడీసీఎల్ ప్రధాన కార్యాలయం నుంచి టోల్ ఫ్రీ నంబర్ సేవలు నిర్వహిస్తున్నారు. దీంతో కింది స్థాయి అధికారులు మరింత బాధ్యతతో పని చేస్తారు. నిరంతరం యాజమాన్యం కూడా టోల్ ఫ్రీ నంబర్‌లకు వచ్చే ఫిర్యాదులను సమీక్షిస్తుండడంతో ఆలస్యానికి ఆస్కారం ఉండదు. ఎన్పీడీసీఎల్ పరిధిలోని 16 సర్కిళ్లకు ఈ సేవలు అందుబాటులోకి తీసుకొచ్చారు. ట్రాన్స్‌ఫార్మర్ల ఫెయిల్యూర్స్, విద్యుత్ సరఫరాలో ఇబ్బందులు, బిల్లుల హెచ్చుతగ్గులు, ఫ్యూజ్ ఆఫ్ కాల్స్, విద్యుత్ మీటర్ల మార్పు, కొత్త సర్వీస్‌ల మంజూరు, పేరు, కేటగిరీ, లోడ్ మార్పుతో పాటు ఇతర సమస్యలు టోల్ ఫ్రీ నంబర్‌కు ఫిర్యాదు చేసి పరిష్కరించుకునే అవకాశం కల్పించింది.

సమస్య సత్వర పరిష్కారానికి టోల్ ఫ్రీ నంబర్ దోహదం...



సమస్య సత్వర పరిష్కారానికి టోల్ ఫ్రీ నంబర్ ఎంతో దోహదపడుతుంది. రైతులు, విద్యుత్ వినియోగదారులకు మెరుగైన సేవలు అందించేందుకు టోల్ ఫ్రీ నంబర్‌పై విస్తృత ప్రచారం చేపట్టాం. రైతులకు ఈ నంబర్‌ను మరింత చేరువ చేస్తున్నాం. ఎలాంటి విద్యుత్ సమస్య తలెత్తినా టోల్ ఫ్రీ నంబర్‌కు ఫిర్యాదు చేయాలి. ప్రతి వినియోగదారుడు గుర్తుకు పెట్టుకునేలా ట్రాన్స్‌ఫార్మర్లపై నంబర్ ముద్రిస్తున్నాం.

-కర్నాటి వరుణ్ రెడ్డి,
సీఎండీ, టీజీ ఎన్పీడీసీఎల్

ఫిర్యాదు రికార్డులో నమోదు..

విద్యుత్ వినియోగదారుడు 1912కు ఫోన్ చేయగానే ముందుగా ఫిర్యాదును స్వీకరించి రికార్డులో నమోదు చేస్తారు. నమోదు చేసిన సమాచారాన్ని సంబంధిత అధికారికి, కార్యాలయానికి పంపిస్తారు. సంబంధిత అధికారికి పంపిన వివరాలు వినియోగదారుడికి మెసేజ్ రూపంలో చేరుతుంది. ఆ అధికారి సమస్యను పరిష్కరించేలా ప్రధాన కార్యాలయం నుంచి అధికారులు చర్యలు తీసుకుంటారు. 1912కు వచ్చిన ఫిర్యాదులను ఉన్నత స్థాయి అధికారులు సమీక్షిస్తారు. తద్వారా త్వరితగతిన సమస్యలు పరిష్కారమవుతాయి.

ఇంట్లో దోషం ఉందని టోకరా..

- నమ్మించి మోసగించిన హిజ్రా
- బాధిత కుటుంబం నుంచి రూ.55 లక్షల వసూలు
- జనగామలో ఆలస్యంగా వెలుగుచూసిన ఘటన

జనగామరూరల్: మీ ఇంట్లో దోషం ఉంది. నేను ఆ దోషాన్ని పోగొడుతాను. మీ అందరికి మంచి చేస్తానని నమ్మించి తన మాయమాటలతో ఓ కుటుంబం నుంచి రూ.55 లక్షలు వసూళ్లకు పాల్పడి నిండా ముంచిన ఓ హిజ్రా ఉదంతం ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఘటన జనగామలో శుక్రవారం చోటు చేసుకుంది. పోలీసులు, బాధితులు, స్థానికుల కథనం ప్రకారం.. జనగామ జిల్లా కేంద్రంలోని వెంకన్నకుంటకు చెందిన సిరివెన్నెల అనే మహిళ నివాసం ఉంటుంది. ఈమె ఇంట్లో తరచూ కుటుంబ సభ్యులు అనారోగ్యాలకు గురవుతున్నారు. జనగామకు చెందిన నిరోషా అనే స్నేహితురాలితో పరిచయం ఉన్న భద్రాది కొత్తగూడెం జిల్లా సత్యనారాయణపురం గ్రామానికి చెందిన ట్రాన్స్‌జెండర్ నాగదేవి జనగామకు రావడంతో సిరివెన్నెల సంప్రదించింది. దీంతో సిరివెన్నెల ఇంటికి వచ్చిన హిజ్రా మీ ఇంట్లో దోషం ఉంది నివారణకు పూజలు చేస్తానని, అవసరమైతే కేరళలో ఉంటున్న తన గురువును తీసుకొస్తానని చెప్పి విడతల వారీగా రూ.55 లక్షలు వసూలు చేసి ఇంట్లో పూజలు చేయడం జరిగింది. పూజలు చేసినా సిరివెన్నెల కుటుంబ సభ్యులకు ఆరోగ్యం మెరుగుకాకపోవడంతో బాధితురాలు ఈ నెల 13న జనగామకు వచ్చిన హిజ్రాను నీ పూజల వల్ల మా కుటుంబానికి ఏ ఫలితం లేకుండా పోయిందని తన డబ్బులు తనకు ఇవ్వాలని నిలదీసింది. దీంతో డబ్బులు ఇచ్చేందుకు నిరాకరించడంతో పాటు కేరళకు వెళ్లి మా గురువును తీసుకొస్తానని చెప్పి అక్కడి నుంచి ఉడాయించింది. దీంతో సదరు బాధితురాలు హిజ్రాకు ఫోన్ చేసినా స్పందించకపోవడంతో తాను మోసపోయానంటూ స్థానిక పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ దామోదర్‌రెడ్డి తెలిపారు. కాగా సైన్స్ ఇంతగా అభివృద్ధి చెందిన ఈ రోజుల్లో ఎవరైనా అనారోగ్యానికి గురైతే డాక్టర్లను సంప్రదించి నయం చేసుకోవాల్సి ఉండగా మూఢనమ్మకాలతో రూ.55 లక్షలు పోగొట్టుకోవడంపై స్థానికులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. ఇదే హిజ్రా ఈ ప్రాంతంలో మరో కుటుంబాన్ని మోసం చేసినట్లు తెలుస్తోంది. వారి వద్ద నుంచి కూడా రూ.15 లక్షల నుంచి రూ.20 లక్షల వరకు డబ్బులు కాజేసినట్లు సమాచారం.

ఎస్సార్‌యూ- ఎంయూన్ '24 సీజన్-2' ప్రారంభం



కార్యక్రమంలో మాట్లాడుతున్న సుధాకర్

హసన్‌పర్తి: ఎస్సార్‌యూ–ఎంయూఎన్ '24 సీజన్–2' కార్యక్రమం శుక్రవారం ఘనంగా ప్రారంభమైంది. ఎస్సార్ యూనివర్సిటీలో మూడు రోజుల పాటు నిర్వహించే కార్యక్రమానికి ఎస్సార్ యూనివర్సిటీ డీన్ ఏ.వీ.వీ. సుధాకర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థులు వివిధ కౌన్సిల్ కింద చర్చల గురించి ప్రపంచంలోని వివిధ దేశాల్లోని అనేక అంశాలపై తమ అభిప్రాయాలను పంచుకుంటారని చెప్పారు. ఇందులో యూనైటెడ్ నేషన్స్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్, యూనైటెడ్ నేషన్స్ జనరల్ అసెంబ్లీ, యూనైటెడ్ నేషన్స్ ఆఫీస్ ఆన్ డ్రగ్స్ అండ్ క్రైమ్, యూనైటెడ్ నేషన్స్ ఎన్విరాన్‌మెంట్ ప్రోగ్రాం, వరల్డ్ హెల్త్ ఆర్గనైజేషన్ ఒక ప్రత్యేక లోక్ సభ సమావేశాలు ఉంటాయని చెప్పారు. కార్యక్రమంలో వివిధ విద్యాసంస్థల నుంచి 650 మంది విద్యార్థులు హాజరయ్యారు. ఈ సందర్భంగా గ్లోబల్, దేశీయ సమస్యలపై చర్చించారు. కార్యక్రమంలో డీన్ డాక్టర్ దీపా, తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల అభివృద్ధే ఆర్ఎంయూ ధ్యేయం

- రైల్వే కార్మికులకు రూ.46 వేల బోనస్‌కు కృషి
- రైల్వేలో ఉన్న 10 వేల ఖాళీలను భర్తీ చేయాలి
- ఆర్ఎంయూ దక్షిణ మధ్య రైల్వే జనరల్ సెక్రటరీ ప్రభుచరణ్



మాట్లాడుతున్న ఆర్ఎంయూ జనరల్ సెక్రటరీ ప్రభుచరణ్

కాజీపేట రూరల్ : రైల్వే కార్మికుల అభివృద్ధే ధ్యేయంగా ఆర్ఎంయూ పని చేస్తుందని, రైల్వేలో గుర్తింపు కోసం డిసెంబర్‌లో జరిగే వన్ ఇండస్ట్రీ వన్ యూనియన్ ఎన్నికల్లో రేల్ మజ్దూర్ యూనియన్‌ను ఆదరించి గెలిపించాలని రైల్వే కార్మికులను ఆర్ఎంయూ దక్షిణ మధ్య రైల్వే జనరల్ సెక్రటరీ టి.ప్రభుచరణ్ అన్నారు. కాజీపేట రైల్వే వీఐపీ లాంజ్‌లో శుక్రవారం జరిగిన ప్రెస్‌మీట్‌లో ఆయన మాట్లాడుతూ రైల్వే ట్రేడ్ యూనియన్లు కార్మికులకు, రైల్వే యంత్రాంగానికి ఒక బ్రిడ్జిగా పని చేయాలని, ప్రస్తుతం ఉన్న రైల్వే ట్రేడ్ యూనియన్లు సొంతలాభం కోసం కార్మికులను దోచుకుంటున్నాయని ఆరోపించారు. రెండు ట్రేడ్ యూనియన్లు కార్మికుల నుంచి ప్రతి నెలా బలవంతంగా చందాలు వసూలు చేస్తున్నాయని, కానీ కార్మికులకు వారు చేసింది ఏమి లేదని దుయ్యబట్టారు. కార్మికులకు పాత పెన్షన్ స్కీంను అమలు చేయాలని, రైల్వేలో ప్రైవేటీకరణను రద్దు చేయాలని, దక్షిణ మధ్య రైల్వేలో ఉన్న 10 వేల ఖాళీలను భర్తీ చేయాలని, 7వ పే కమిషన్ ప్రకారం కార్మికులకు రూ. 46 వేల బోనస్ చెల్లించాలని డిమాండ్ చేశారు. రైల్వే కారుణ్య నియామకాల్లో బాధితులకు జరుగుతుందని అన్నారు. 1974లో నాటి కేంద్రమంత్రి జార్జ్ పెర్నాండేజ్ స్థాపించిన ఆర్ఎంయూను కార్మికులు గెలిపించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో ఆర్ఎంయూ ఏజీఎస్ బి.సురమలేశ్వర్‌రావు, జోనల్ వైస్ ప్రెసిడెంట్ ఆర్.సదానందం, జోనల్ ట్రెజరర్ రామారావు, కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

మద్యానికి బానిసై ఒకరి ఆత్మహత్య

ధర్మసాగర్ : మద్యం మత్తులో పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మండలంలోని పెద్దపెండ్యాల గ్రామంలో శుక్రవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పెద్దపెండ్యాలకు చెందిన మానుక రాజన్న (50) మద్యానికి బానిసై మద్యం మత్తులో గురువారం ఉదయం బావి వద్దకు వెళ్లి పురుగుల మందు తాగాడు. ఇది గమనించిన కుమారుడు హర్షిత్ కుటుంబ సభ్యుల సాయంతో రాజన్నను చికిత్స నిమిత్తం ఎంజీఎం ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై జానీ పాషా తెలిపాడు.